# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి జరుగుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్. ఎల్. మురుగన్ పేర్కొన్నారు.**
2. **పర్యావరణంపై ఆసక్తి ఉన్న వారిని 'ఎకో వారియర్స్'గా ఎంపిక చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
3. **రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.**
4. **ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**
5. **నీట్ యూజీ పరీక్షకి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఈరోజు విచారణ జరుపుతుంది.**

==========================

డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి జరుగుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్. ఎల్. మురుగన్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈరోజు నిర్వహిస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాల్లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రహదార్లు, నౌకాశ్రయాల్లో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. రైతులకు మేలు చేసే విధంగా కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 25 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ పాల్గొన్నారు.

--------------------------

వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్వహణపై పంచాయతీరాజ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులతో నిన్న పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యర్థాల నిర్వహణపై చైతన్యం తీసుకురావాలన్నారు. పర్యావరణంపై ఆసక్తి ఉన్న వారిని 'ఎకో వారియర్స్'గా ఎంపిక చేయాలని వారితో వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. భీమవరంలో కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు తొమ్మిది మంది కేంద్ర మంత్రులు, నీతి ఆయోగ్, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్లను కలిసి రాష్ట్ర పరిస్థితులను వివరించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం అండగా నిలుస్తుందని చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య చక్కటి సమన్వయం ఉందని, అపరిష్కృత సమస్యలు పరిష్కరించుకొనే దిశగా వారు ముందడుగు వేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో అదనపు గదుల నిర్మాణాలకు రాజమహేంద్రవరం పార్లమెటు సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరితో కలిసి మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాణం పోసేది నిలిపేది ఆస్పత్రులే అని అన్నారు. ప్రాంతీయ ఆస్పత్రిగా ఆధునీకరించడం ద్వారా అనేక రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు.

---------------------------

నీట్ యూజీ పరీక్షకి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఈరోజు విచారణ జరుపుతుంది. నీట్ పరీక్షకి సంబంధించి సుప్రీం కోర్ట్ వెబ్సైట్లో అప్ లోడ్ చేసిన జాబితా ప్రకారం ఈరోజు 26 పిటిషన్లపై విచారణ జరగనుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.ఎస్ చంద్ర చూడ్, జస్టిస్ జె బి పార్దివాల, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరుపుతుంది. అలాగే నీట్ యు జి పరీక్షను మళ్లీ నిర్వహించవలసిన అవసరం లేదని పరీక్ష నిర్వహణలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని అనడానికి ఎటువంటి సాక్షాధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. మళ్లీ పరీక్ష నిర్వహించడం వల్ల పరీక్షకు హాజరైన లక్షలాది విద్యార్థులు ప్రభావితమవుతారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఈ రోజు వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు.

మరోవైపు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.యస్. షర్మిల ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. అలాగే ఇవాళ విజయవాడలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు పొంగులేటి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొంటారని

ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా వైఎస్ఆర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ నివాళి అర్పించి మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి వ్యక్తిగతంగా ఎంతో నేర్చుకున్నానని, జోడో పాదయాత్రకు ఆయన పాదయాత్రే స్ఫూర్తి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

---------------------------

ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి.బాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చతుకుపాడులోని ఇసుక రీచ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత ఇసుక పంపిణీని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజులలోపే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. చతుకుపాడు రీచ్ లో 42వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 35 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి 210 బీటెక్, రెండు ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ కళాశాలలకు నిర్ణీత రుసుములు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్‌లో బీటెక్ కోర్సులకు అత్యధికంగా 1.03 లక్షల రూపాయల నుంచి అత్యల్పంగా 40 వేల రూపాయల చొప్పున నిర్ణయించారు. ట్యూషన్, గుర్తింపుకార్డు, మెడికల్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యార్థి కార్యకలాపాలు తదితర ఖర్చులన్నీ ఈ రుసుములోకే వస్తాయని విద్యాశాఖ తెలిపింది. కాగా వసతి, రవాణా, మెస్, రిజిస్ట్రేషన్, ప్రవేశ, రిఫండబుల్ రుసుములు ఇందులో చేర్చలేదని అధికారులు తెలిపారు. నిర్ణయించిన రుసుములకు మించి అదనంగా ఎలాంటి మొత్తమూ వసూలు చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలా చేసేవారిపై చట్టప్రకారం జరిమానా విధించడంతోపాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ పేర్కొన్నారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలో వినియోగదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రాలలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులు ఇసుక తీసుకువెళ్ళవచ్చని తెలిపారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులు, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6041 ను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. నల్లజర్ల వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలో గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గంట్యాడలోని టోల్

ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిందని పోలీసు అధికారులు తెలిపారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించిందని. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

========================